"ఓలమ్మో గాలెత్తీసినాది. కమ్మ లెగిరిపోతాయి గావాల" అని కొంతసేపు బెంగగాను, "అమ్మోలమ్మ .... నూకలకైనా యెల్నానుగాను" అని మరికొంత సేపు విసుగ్గాను, "ఓర్నాయనో ఆ సెట్టేలా వూగిపోతంది. ఇరిగిపోద్ది గావాల" అని యింకొంత సేపు భయంగాను, తెగిపోయిన గొలుసులా ఆలోచనలు ముక్కలు ముక్కలుగా వస్తున్నాయి గుడిసెలోని ఆడ మనిషికి. దానికి తోడు పిల్లాడు యేడుపు మానకపోవడంతో పిచ్చెక్కి నట్టయ్యింది.

"ఓరయ్యోరే .... వొల్లొల్లకోరా, ఉఁఊఁ ఏటీ గుంటడూ" అని వొళ్ళోకి తీసుకుని "ళొళ్ళొళ్ళొ" అంది. కాని గుంటడు ఊరుకోకుండా, గుక్క పెడుతూనే వున్నాడు. గుడిసెలోంచి వొంగి బయటికి గాల్లోకి తీసుకొచ్చింది. అప్పటికీ వూరుకోలేదు. అంతా చీకటిగా వుంది. ఆ చీకటిలో యేవీ లేకపోయినా, ఏవీ కనిపించకపోయినా, "అడుగోర సెందమావ....ఏదిరా దాదా.... అద్దగో ఏపసెట్టమ్మో....అమ్మో యెంత పెద్దదో" అంటోంది. తలనిండా కళ్ళున్న రాక్షసి మోహంలా, తోకమీద నిలబడ్డ పాము పడగలా వుందా వేపచెట్టు. అంతే. గుంటడు ఊరుకున్నాడు.

రచయితకి ఆ వేపచెట్టు, తను కథలెల్లా రాసినా ఆమో దించి ఏకండీగా తలలూపే పాఠకుల సమూహంలా కనిపిస్తోంది. రచయిత పూర్వాశ్రమంలో ప్రేమకథలు రాసేడు. టీనేజ్ కుర్రాళ్ళనొక వూపు వూపేడు. సెంటిమెంటల్ స్టోరీస్ రాసేడు.

